క్లుప్తంగా

వెదజల్లే పద్ధతితో లాభాలు

రఘునాథపాలెం: రైతులు వెదజల్లే వరిసాగు ద్వారా తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించవచ్చని మండల వ్యవసాయ అధికారి కె.ఉమామహేశ్వరరెడ్డి రైతులకు సూచించారు. బుధవారం మండలంలోని పాపటపల్లి గ్రామంలో వెదజల్లిన వరి, నాటుపెట్టిన వరి పొలాలను పరిశీలించారు. రైతులకు కలుపు నివారణలో సలహాలు, సూచనలు చేశారు.

ద్విచక్ర వాహనం చోరీ

రఘునాథపాలెం: మండలంలోని వీవీపాలెంలో పార్కింగ్ చేసిన ద్విచక్ర వాహనం చోరీ అయింది. హోటల్ నిర్వహిస్తున్న సన్నీకి చెందిన ద్విచక్రవాహనం మంగళవారం రాత్రి ఇంటి ముందు పార్కింగ్ చేయగా.. బుధవారం ఉదయం లేకపోవడంతో చోరీ అయినట్లు గుర్తించారు.

ఇంజనీరింగ్ కళాశాలకు రూ.108 కోట్లు

ఖమ్మంరూరల్/నేలకొండపల్లి: మండలంలోని మద్దులపల్లిలో నిర్మించనున్న జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కళాశాల శాశ్వత భవన నిర్మాణానికి రూ.108.60 కోట్లు మంజూరు చేస్తూ ప్రభుత్వం జీఓ విడుదల చేసినట్లు మంత్రి పొంగులేటి క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జ్ తుంబూరు దయాకర్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈమేరకు నేలకొండపల్లిలో ఆమ్‌ఆద్మీ పార్టీ రాష్ట్ర యువజన విభాగం ఉపాధ్యక్షుడు పసుమర్తి శ్రీనివాస్ మంత్రి శ్రీనివాసరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

బంగారు ఆభరణాలు స్వాధీనం

తిరుమలాయపాలెం: మండలంలోని బచ్చోడు గ్రామంలో ఈ నెల 6న నందిపాటి రామకృష్ణ ఇంట్లో బంగారు ఆభరణాలు చోరీ జరిగిన ఘటనలో నిందితుడిని పోలీసులు బుధవారం అరెస్టు చేసి ఆభరణాలు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు బుధవారం ఎస్‌ఐ కూచిపూడి జగదీష్ వివరాలు వెల్లడించారు. కూసుమంచి మండలం పాలేరు గ్రామానికి చెందిన పడిశాల సలీంను అదుపులోకి తీసుకుని విచారించగా నేరం ఒప్పుకోవడంతో అతడిని కోర్టులో రిమాండ్ చేసినట్లు తెలిపారు.

వ్యవసాయ కళాశాల విద్యార్థుల క్షేత్ర ప్రదర్శన

కూసుమంచి: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేటలోని వ్యవసాయ కళాశాల విద్యార్థులు బుధవారం మండల వ్యవసాయాధికారి రామడుగు వాణి ఆధ్వర్యాన మండలంలోని కేశ్వాపురం గ్రామంలో చేపల పెంపకం, ఉత్పత్తి యూనిట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం మునిగేపల్లి గ్రామానికి చెందిన నెల్లూరి శేషగిరి సాగుచేసిన హైబ్రిడ్ మిర్చి, టమాటా, బొప్పాయి పంటల సాగును పరిశీలించారు. వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ హేమంత్‌కుమార్, బోధన సిబ్బంది నాగాంజలి, మధుసూదన్‌రెడ్డి, రామ్‌ప్రసాద్, ప్రియారెడ్డి, దీపక్‌రెడ్డి, శిరీష పాల్గొన్నారు.

పోలీస్ అధికారులకు నగదు రివార్డు

ఖమ్మంక్రైం: ఇటీవల నగరంలోని అపార్ట్‌మెంట్‌లో జరిగిన దొంగతనం ఘటనతో పాటు పలు చోరీ కేసుల్లో నిందితుడు గుగులోత్ నవీన్‌ను పట్టుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించిన సెంట్రల్ క్రైమ్ స్టేషన్ పోలీస్ అధికారులను సీపీ సునీల్‌దత్ అభినందించారు. బుధవారం సీపీ కార్యాలయంలో సీసీఎస్ ఏసీపీ సర్వర్‌ను, పోలీస్ సిబ్బంది మాంగిత్య ఎం.గజేంద్ర, ఎస్‌శ్రీనివాస్, సుధాకర్‌లకు నగదు రివార్డు అందజేశారు.

ట్రాన్స్‌జెండర్లకు బ్యాంక్ ఖాతాలు

ఖమ్మంమయూరిసెంటర్: నగరంలోని ట్రాన్స్‌జెండర్లకు మెప్మా అధికారులు ప్రత్యేకంగా ఇండియన్ బ్యాంక్‌లో ఖాతాలను తెరిపిస్తున్నారు. కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య ఆదేశాలతో నగరంలో ఇప్పటికే 10 మంది ట్రాన్స్‌జెండర్లతో స్వయం సహాయక సంఘాన్ని ఏర్పాటు చేయగా.. మిగిలిన వారికి మహిళా శక్తి క్యాంటీన్లను తెరిపించి ఉపాధి చూపించేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఇప్పటికే 20 మందికి ఖాతాలను తెరిపించినట్లు మెప్మా అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీఎంసీ సుజాత, సీఓ సల్మా తదితరులు పాల్గొన్నారు.

టీజీఆర్‌ఎస్‌ఏ కమిటీ ఎన్నిక

ఖమ్మంసహకారనగర్: తెలంగాణ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ (టీజీఆర్‌ఎస్‌ఏ) అడ్‌హక్ కమిటీని మంగళవారం రాత్రి నగరంలోని ఖమ్మం జూబ్లీక్లబ్‌లో టీజీటీఏ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షుడు కోటా రవికుమార్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కాటిబోయిన అభిరాములు, కార్యదర్శిగా పాలడుగు మురళి, ట్రెజరర్‌గా మధుసూదన్‌రావు, మహిళా అధ్యక్షురాలిగా ఎం.సత్యవతి, ఉపాధ్యక్షులుగా అరుణరెడ్డి, ఎ.వనజ, ఉపాధ్యక్షులుగా జి.సుధీర్, ఎస్.చిరంజీవి, జి.లక్ష్మణ్, ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా ఎ.శివకుమార్, టి.పూర్ణచందర్‌రావు, బి.మహేష్, కల్చరల్ సెక్రటరీగా బి.నాగేశ్వరరావు, కె.లక్ష్మి, జాయింట్ సెక్రటరీలుగా డి.అలీఅక్బర్, ఎ.జార్జి, కె.శ్రీనివాస్, పి.విజయ్‌కుమార్, స్పోర్ట్స్ సెక్రటరీగా జల్లి లక్ష్మయ్యలను ఎన్నుకున్నారు.

సొంత సేవలకు సంసిద్ధం..!


ట్రంక్‌రోడ్‌లో నిర్మాణంలో ఉన్న యూపీహెచ్‌సీ నూతన భవనం

వెంకటేశ్వరనగర్ యూపీహెచ్‌సీకి మహర్దశ

- రూ.1.20 కోట్లతో సొంత భవన నిర్మాణం
- చకచకా జరుగుతున్న పనులు
- ఆరు నెలల్లో అందుబాటులోకి..
- తప్పనున్న మున్నేరు ముప్పు

ఖమ్మంవైద్యవిభాగం: నగరంలోని వెంకటేశ్వరనగర్ అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్(యూపీహెచ్‌సీ)కు మహర్దశ పట్టనుంది. నూతన భవన నిర్మాణానికి నిధులు మంజూరవడంతో పనులు చకచకా జరిపించి నూతన భవనాన్ని త్వరగా అందుబాటులోకి తెచ్చేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. కాగా, యూపీహెచ్‌సీ చాలా కాలంగా అద్దె భవనంలో కొనసాగుతోంది. దీంతో సొంత భవనం కోసం అధికారులు ఎన్నో సార్లు పైఅధికారులకు ప్రతిపాదనలు పంపినా ప్రయోజనం లేకుండా పోయింది. ఈనేపథ్యాన గతేడాది యూపీహెచ్‌సీ నూతన భవన నిర్మాణానికి ప్రభుత్వం రూ.1.20 కోట్లు మంజూరు చేస్తూ అనుమతులు ఇచ్చింది. దీంతో అధికారులు ట్రంక్ రోడ్డులోని ఎంఆర్‌ఓ కార్యాలయం పక్కన ప్రభుత్వ స్థలాన్ని కేటాయించి గతేడాది మార్చిలో శంకుస్థాపన చేశారు. కానీ పనులు మాత్రం వెంటనే చేపట్టలేదు.

మునిచిన మున్నేరు..

మున్నేరు వరద తాకిడికి వెంకటేశ్వరనగర్ యూపీహెచ్‌సీ రెండు సార్లు మునిగింది. 2023 జూలైలో ఒకసారి, 2024 సెప్టెంబర్ 1న వచ్చిన వరదలకు తీవ్ర నష్టం వాటిల్లింది. 2023లో సెంటర్ వెంకటేశ్వర్‌నగర్ ప్రాంతంలో ఉండగా.. నీట మునిగి సామగ్రి, మందులు పూర్తిగా తడిసిపోయాయి. దీంతో గతేడాది సెంటర్‌ను సారథినగర్‌కు మార్చారు. అయినా ఎన్నడూ లేనంతగా వరద పోటెత్తడంతో యూపీహెచ్‌సీ పూర్తిగా నీట మునిగి అందులోని మందులు, సామగ్రి ఎందుకూ పనికి రాకుండా పోయాయి. అంతే కాకుండా ఫ్రిజ్‌ల లో నిల్వ ఉంచిన వ్యాక్సిన్స్ కూడా వినియోగించుకునే అవకాశం లేకుండా పోయాయి. సుమారు రూ.10లక్షల నష్టం వాటిల్లినట్లు అధికారులు అంచనా వేశారు.


ఇటీవల వచ్చిన వరదకు తడిసిన మందులు(ఫైల్)

ఇన్నాళ్లు అద్దె భవనాల్లోనే..

యూపీహెచ్‌సీకి సొంత భవనం లేకపోవడంతో చాలా కాలంగా ప్రైవేట్ భవనాల్లో కొనసాగించాల్సి వచ్చింది. ప్రస్తుతం రూ.10వేలు అద్దె చెల్లిస్తుండగా, సకాలంలో ప్రభుత్వం నుంచి నిధులు విడుదల కాక యజమానుల నుంచి ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వచ్చేది. కాగా, గత రెండు నెలలుగా పనులు చకచకా జరుగుతుండడంతో వచ్చే జూన్ కల్లా భవన నిర్మాణం పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తెచ్చేందుకు అధికారులు పనులు చేయిస్తున్నారు.

నిత్యం 100 వరకు ఓపీలు..

వెంకటేశ్వరనగర్ యూపీహెచ్‌సీ పరిధిలో జూబ్లిపుర, బొక్కలగడ్డ, మంచికంటినగర్, వెంకటేశ్వరనగర్, శుక్రవారిపేట, బ్యాంక్‌కాలనీ, ఖిల్లా, శ్రీనగర్‌కాలనీ, నిజాంపేట ప్రాంతాలు ఉన్నాయి. దీనిలో 12వ, 13వ, 46వ, 47వ, 37వ, 38వ, 39వ, 40వ, 42వ, 55వ, 56వ డివిజన్లలో కొంత భాగం ఈ సెంటర్ పరిధిలో ఉండడంతో నిత్యం 70 నుంచి 100 మంది వైద్య సేవలకు వస్తుంటారు. ఈ సెంటర్‌లో 18 మంది సిబ్బంది పనిచేస్తుండగా.. ఇందులో మెడికల్ ఆఫీసర్‌తో పాటు ఆరుగురు ఆశాలు, ఐదుగురు ఏఎన్‌ఎంలు, సూపర్‌వైజర్, స్టాఫ్‌నర్స్, ల్యాబ్ టెక్నీషియన్, ఫార్మాసిస్ట్ ఒక్కొక్కరు చొప్పున ఉండగా.. ఇద్దరు అటెండర్లు పని చేస్తున్నారు. ఇంతటి ప్రాముఖ్యత కలిగిన సెంటర్‌కు ఇన్నాళ్లు సొంత భవనం లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యాయి. వచ్చే జూన్‌లో నూతన భవనం అందుబాటులోకి రానుండటంతో సెంటర్ సిబ్బంది హర్షం వ్యక్తం చేస్తున్నారు.

జూన్‌లో అందుబాటులోకి..

ఇన్నాళ్లు సొంత భవనం లేక తీవ్ర ఇబ్బందులు పడ్డారు. రూ.1.20 కోట్లతో ట్రంక్‌రోడ్‌లో నూతన భవన నిర్మాణ పనులు యుద్ధప్రాతిపదికన జరుగుతున్నాయి. వచ్చే జూన్ కల్లా భవనాన్ని అందుబాటులోకి తెచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నాం. గతంలో మున్నేరు వరద తాకిడికి రెండుసార్లు సెంటర్‌కు తీవ్ర నష్టం వాటిల్లింది. నూతన భవనానికి ఆ సమస్య ఉండదు.

– బి.కళావతిబాయి, డీఎంహెచ్‌ఓ

రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం


బీజేపీ నేతలను అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు

ఖమ్మం మామిళ్లగూడెం: బీజేపీ కార్యాలయంపై కాంగ్రెస్ పార్టీ నాయకులు దాడికి నిరసనగా నగరంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు గల్లా సత్యనారాయణ ఆధ్వర్యాన భారీ ర్యాలీ నిర్వహించారు. మంగళవారం ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్ నుంచి ర్యాలీగా కాంగ్రెస్ పార్టీ కార్యాలయం ముట్టడికి ప్రయత్నించగా.. మయూరిసెంటర్‌లో పోలీసులు అడ్డుకున్నారు. అయితే బీజేపీ నాయకులు కాంగ్రెస్ ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేయగా.. పోలీసులు అడ్డుకుని బీజేపీ నాయకులను టూటౌన్‌పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా గల్లా సత్యనారాయణ మాట్లాడుతూ.. బీజేపీ నాయకులపై దాడి చేసిన కాంగ్రెస్ గుండాలను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర, జిల్లా కార్యవర్గ సభ్యులు, అధ్యక్షులు, కార్యదర్శులు, కన్వీనర్లు, నాయకులు దొంగల సత్యనారాయణ, భూక్య శ్యాం సుందర్‌నాయక్, రుద్ర ప్రదీప్, అల్లిక అంజయ్యయాదవ్, మందా సరస్వతి, గుత్తా వెంకటేశ్వర్లు, వేల్పుల సుధాకర్, బోయినపల్లి చంద్రశేఖర్, దొడ్డ అరుణ, ఏలూరి నాగేశ్వరరావు, నెల్లూరు కోటేశ్వరరావు, ఈదుల వీరభద్రం, పిల్లలు మరి వెంకట్, తాజనోత్ భద్రం, వెంకట్‌నారాయణ, మార్తి వీరభద్రప్రసాద్, రవి రాథోడ్, చావా కిరణ్, కోటమర్తి సుదర్శన్, అంకతి పాపారావు, శాసనాల సాయిరాం, వల్లాల రమేష్, కొప్పు కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కరాటే పోటీల్లో విద్యార్థుల సత్తా


పతకాలు సాధించిన ఢిల్లీ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు


విద్యార్థులను అభినందిస్తున్న బేబీమూన్ కరస్పాండెంట్

ఖమ్మంసహకారనగర్: హైదరాబాద్ ఓపెన్ కరాటే చాంపియన్‌షిప్ 2025 పోటీల్లో ఢిల్లీ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు సత్తా చాటారని పాఠశాల డైరెక్టర్ రవీందర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ నిధిరాజ్‌గుప్తా తెలిపారు. బుధవారం పాఠశాల విద్యార్థులు ఆర్.యువనీత్‌రెడ్డి, శాన్వి, ఆరాధ్య, మనస్విని, తన్వి, యామిని, శ్రేష్ఠలతో పాటు కరాటే కోచ్ రేఖను అభినందించారు. అదే విధంగా నగరంలోని బేబీమూన్ పాఠశాలకు చెందిన విద్యార్థులు ఎండీ రయాన్, ఎండీ అయాన్‌లు ఇటీవల స్టార్ డ్రాగన్ కరాటే క్లబ్ ఆధ్వర్యాన జరిగిన జాతీయ కరాటే చాంపియన్‌షిప్‌లో ప్రతిభ చూపి ఎల్లో బెల్ట్ సాధించినట్లు పాఠశాల కరస్పాండెంట్ కేసా వీరన్న తెలిపారు. ఈమేరకు బుధవారం వారిని అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ కేసా భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

కేఎంసీలో విజిలెన్స్ తనిఖీ

ఖమ్మంమయూరిసెంటర్: గత ప్రభుత్వ హయాంలో జరిగిన పలు అభివృద్ధి పనులపై విజిలెన్స్ అధికారుల తనిఖీలు కొనసాగుతూనే ఉన్నాయి. ఇప్పటికే పలుమార్లు నగరంలో పర్యటించిన అధికారులు పలు రికార్డులను స్వాధీనం చేసుకొని, జరిగిన పనులను తనిఖీలు చేసి నివేదికలను పైఅధికారులకు అందజేశారు. అయితే నగరంలోని మరో మూడు పనులకు సంబంధించిన ఫైళ్లను కేఎంసీ అధికారులు ఇవ్వకపోవడంతో బుధవారం కార్యాలయానికి వచ్చినట్లు తెలిసింది. కేఎంసీలోని డీబీ సెక్షన్‌లో ఫైళ్ల అంశంపై సిబ్బందిని ఆరా తీయగా.. పలు ఎంబీలు దొరకడం లేదని సమాధానం చెప్పినట్లు సమాచారం. విజిలెన్స్ డీఈఈ, ఏఈఈ ఇతర అధికారులు కేఎంసీ భవనం చుట్టూ తిరిగి పరిశీలన చేశారు. కాగా, కేఎంసీ భవనాన్ని బుధవారం రాత్రి కొలతలు వేసి, పిల్లర్ల సామర్థ్యాన్ని మిషన్లతో పరిశీలించారు.

ఆర్టీఓకు వినతి

ఖమ్మం మామిళ్లగూడెం: తెలంగాణ ప్రగతిశీల ఆటో అండ్ మోటార్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా మంగళవారం ఆటో మోటార్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఖమ్మం ఆర్టీఓ వెంకటనారాయణకు వినతి పత్రం అందజేశారు. ఈ యూనియన్ ఖమ్మం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కంకణాల శీను, షేక్.లాల్‌మియా మాట్లాడుతూ.. బస్టాండ్, రైల్వేస్టేషన్ రద్దీగా ఉన్న ప్రాంతంలో ఆటో స్టాండ్‌లకు అవకాశం కల్పించాలని, మోటార్ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, 2019 వాహన చట్టం సవరణ ఎత్తివేయాలని కోరారు. వినతి అందించిన వారిలో సహాయ కార్యదర్శి ఎడ్లపల్లి ఉపేందర్, కోశాధికారి లక్ష్మీనారాయణ, వెంకటేశ్వర్లు, రాజు, నాగయ్య, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

పండితాపురం సంతలో మూడు ముక్కలాట


సంతలో జూదం ఆటలో పాల్గొన్న రైతులు

కామేపల్లి : రాష్ట్రంలో పేరుపొందిన సంతల్లో ఒకటైన కొమ్మినేపల్లి జీపీ పండితాపురం వారంతపు సంతలో బుధవారం బహిరంగంగానే మూడుముక్కల ఆడుతున్నారు. ఈ ఆట నిర్వాహకులే వ్యాపారులు, రైతులను ప్రోత్సహించేలా చేసి రూ.లక్షల్లో దండుకుంటున్నారు. ఖమ్మం–ఇల్లెందు ప్రధాన రహదారిపై ట్రాఫిక్ సమస్య లేకుండా పోలీసులు పర్యవేక్షిస్తున్నారే తప్ప సంతలోని ఆటను మాత్రం పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. అసాంఘిక కార్యక్రమాలకు అడ్డగా మారుతున్న సంతపై పోలీసులు నిరంతర పర్యవేక్షణ అవసరమని వ్యాపారులు, రైతులు కోరుతున్నారు. ఇటీవల సంతలో పట్టుబడిన కొందరిని అదుపులోకి తీసుకున్న స్థానిక పోలీసులు వారిపై ఎటువంటి కేసులు పెట్టకుండా మందలించి పంపినట్లు సమాచారం.

నేడు విద్యుత్ అంతరాయం

రఘునాథపాలెం/ఖమ్మంవ్యవసాయం: విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు, విద్యుత్ లైన్లకు అడ్డుగా ఉన్న చెట్లకొమ్మల తొలగింపు, తదితర కారణాల వల్ల నేడు(గురువారం) విద్యుత్‌కు అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖాధికారులు తెలిపారు. ఈనేపథ్యాన రఘునాథపాలెం విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు అంతరాయం ఉంటుందన్నారు. అలాగే నగరంలోని గాంధీచౌక్ సబ్‌స్టేషన్ 11 కేవీ మోతీనగర్ ఫీడర్ పరిధిలో ఉదయం 9 నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని, వినియోగదారులు సహకరించాలని అధికారులు కోరారు.

బోర్డుల తొలగింపు

ఖమ్మంమయూరిసెంటర్: నగరంలోని మయూరిసెంటర్ నుంచి బస్‌డిపో రోడ్డులో రాపర్తినగర్ వరకు రోడ్డుకు ఇరువైపుల ఏర్పాటు చేసిన బోర్డులు, ఆక్రమణలను కేఎంసీ సిబ్బంది తొలగించారు. బుధవారం కేఎంసీ అసిస్టెంట్ కమిషనర్ అహ్మద్ షఫీఉల్లా, ఏసీపీ వసుందర ఆధ్వర్యాన టౌన్ ప్లానింగ్, డీఆర్‌ఎఫ్ సిబ్బంది ఆక్రమణలను తొలగించారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలిగేలా రోడ్లను ఆక్రమించి నిర్మాణాలు చేపడితే వాటిని తొలగించడంతో పాటు మున్సిపల్ యాక్ట్ ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

రక్తదానం

ఖమ్మంరూరల్: మండలంలోని సాయిగణేష్‌నగర్‌లో పాలేరు మాజీ ఎమ్మెల్యే కందాళ ఉపేందర్‌రెడ్డి పుట్టినరోజు సందర్భంగా బీఆర్‌ఎస్ నాయకులు తలసేమియా బాధితుల కోసం రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు.ఈ శిబిరాన్ని సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య ప్రారంభించగా.. పలువురు బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ అధ్యక్షులు బెల్లం వేణు, వేముల వీరయ్య, బాషబోయిన వీరన్న, ఉన్నం బ్రహ్మయ్య, నాయకులు శేఖర్, వెంకన్న, కిషన్, వరప్రసాద్, అంజయ్య, వీరయ్య, ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు వెడల్పు చేయాలి

ఖమ్మం మామిళ్లగూడెం: ఖమ్మం కాల్వొడ్డు మున్నేరు పక్కన ఏర్పాటు చేసిన రోడ్డును వెడల్పు చేయాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు యర్రా శ్రీకాంత్, ఖమ్మం డివిజన్ కార్యదర్శి వై.విక్రమ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం సీపీఎం బృందం ఆధ్వర్యాన రోడ్డును పరిశీలించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. మున్నేటి బ్రిడ్జిపై రాకపోకలు నిలిపివేసిన అధికారులు ప్రత్యామ్నాయంగా మున్నేరులో ఏర్పాటు చేసిన సింగిల్ రోడ్డుతో వాహనాల రాకపోకలు ఇబ్బందిగా మారిందని, వెంటనే రోడ్డును డబుల్ రోడ్డుగా మార్చడంతో పాటు లైటింగ్ ఏర్పాటు, ట్రాఫిక్ పోలీస్ సిబ్బందిని నియమించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఎర్ర శ్రీనివాసరావు, డివిజన్ కార్యదర్శి వర్గ సభ్యుడు వజ్జనేపల్లి శ్రీనివాసరావు, త్రీటౌన్ కార్యదర్శి భూక్య శ్రీనివాసరావు, సీనియర్ నాయకులు బండారు యాకయ్య, డీవైఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షుడు శీలం వీరబాబు, నాయకులు హనుమంతాచారి, నాగేశ్వరరావు, జార్జి, పుల్లయ్య, పాపారావు తదితరులు పాల్గొన్నారు.

రైతుల సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం


కొత్తగూడెంలో ర్యాలీ తీస్తున్న రైతు సంఘం నాయకులు

ఖమ్మంఅర్బన్: కేంద్ర ప్రభుత్వం రైతుల సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని తెలంగాణ రైతు సంఘం అధ్యక్షుడు పోతినేని సుదర్శన్‌రావు విమర్శించారు. బుధవారం నగరంలోని కొత్తగూడెంలో జరిగిన సమావేశంలో, ఎర్రబోయిన లింగయ్య స్మారక భవనంలో ఆయన మాట్లాడారు. పంజాబ్, హర్యానా సరిహద్దుల్లో నిరాహార దీక్ష చేస్తున్న రైతు నేత జగ్జిత్‌సింగ్ దల్లెవాల్ ప్రాణాలు కాపాడాలని గ్రామంలో రైతులు ప్రదర్శన ర్యాలీ నిర్వహించారు. నూతన వ్యవసాయ మార్కెట్ విధాన పత్రం ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం రాష్ట్ర కమిటీ సభ్యుడు నున్నా నాగేశ్వరరావు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన రైతు రుణమాఫీ, రైతు భరోసా, పంటల బోనస్ సక్రమంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు మాదినేని రమేష్, తెలంగాణ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బండి రమేష్, ఎస్‌ఎస్‌కె మీరా, వాసిరెడ్డి ప్రసాద్, సహాయ కార్యదర్శులు చింతనిప్పు చలపతిరావు, కృష్ణ, బిక్కసాని గంగాధర్‌లతో పాటు ఎర్రబోయిన గోవింద్, కుసుపూడి మధు, గూడూరి ఉమా, ఎర్రబోయిన ఉపేందర్, వెంకన్న, తదితరులు పాల్గొన్నారు.

క్లబ్ సేవలు విస్తృతపరచాలి

నేలకొండపల్లి: వాసవీ క్లబ్స్ సేవలు మరింత విస్తృతపరచాలని జిల్లా గవర్నర్ కొత్తా వెంకటేశ్వరరావు సూచించారు. మండల కేంద్రంలోని వాసవీ భవన్‌లో నేలకొండపల్లి, ముదిగొండ, కూసుమంచి మండలాలకు చెందిన క్లబ్ అధ్యక్షులు, ప్రతినిధులు బుధవారం ప్రమాణాస్వీకారం చేసిన సందర్భంగా ఆయన మట్లాడారు. అనంతరం ముగ్గుల పోటీల విజేతలకు బహుమతులు అందించారు. వాసవీ క్లబ్ నుంచి నోట్ పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైస్ గవర్నర్ వరప్రసాద్, దివాకర్, డీసీఎంఎస్ డైరెక్టర్ నాగుబండి శ్రీనివాసరావుతో పాటు రేగూరి హనుమంతరావు, దోసపాటి శేఖర్, రేగూరి వాసవి, అశోక్, తదితరులు పాల్గొన్నారు.

క్యాలెండర్లు ఆవిష్కరణ

ఖమ్మం మామిళ్లగూడెం: గౌడ అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ నూతన సంవత్సర క్యాలెండర్లను ఖమ్మం శ్రీదేవి నర్సింగ్ హోమ్‌లో జిల్లా గోపా కమిటీ ఆధ్వర్యాన ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, ఐఎంఏ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బొల్లికొండ శ్రీనివాసరావులు పాల్గొని ఆవిష్కరించారు. అనంతరం నూతనంగా ఉద్యోగాలు పొందిన గౌడ ఉద్యోగులను సన్మానించారు. గోపా అధ్యక్షుడు గుడిద శ్రీనివాస్‌గౌడ్ అధ్యక్షత జరిగిన ఈ కార్యక్రమంలో గోపా రాష్ట్ర ఉపాధ్యక్షుడు తాళ్లపల్లి రామకృష్ణ, తెలంగాణ గౌడ సంఘం జిల్లా అధ్యక్షుడు కత్తి నెహ్రూ, మాజీ కార్పొరేటర్ వడ్డెబోయిన నరసింహారావుతో పాటు సురేందర్, నాగని రాంప్రసాద్, వినయ్‌కుమార్, మారుతిబాబు, లక్ష్మణ్, పావని, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

దుప్పట్లు పంపిణీ

- విద్యార్థులకు..


దుప్పట్లు అందుకున్న విద్యార్థులతో సొసైటీ బాధ్యులు

ఖమ్మం మామిళ్లగూడెం: ఖమ్మంలోని ఎస్సీ హాస్టల్‌లో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యాన మంగళవారం విద్యార్థులకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఖమ్మం జిల్లా చైర్మన్ డాక్టర్ వెలిగేటి చంద్రమోహన్ మాట్లాడుతూ.. చలి తీవ్రత దృష్ట్యా వి.వెంకటాయపాలెంలో ఎస్సీ హాస్టల్‌లోనూ విద్యార్థులకు దుప్పట్లు అందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సూర్యప్రకాశరావు, సాధినేని జనార్దన్‌రావు, గోవర్ధన్‌రావు, కేదాసు నరసయ్య, జిల్లా వెంకటేశ్వర్లు, ఉపేందర్‌రెడ్డి, తాత రాఘవయ్య, నాగేశ్వరరావు, వెంకటేశ్వర్లు, శ్రీహరి, పాల్గొన్నారు.

- వృద్ధులకు..


దుప్పట్లు అందజేస్తున్న ప్రభాకర్‌రెడ్డి, తదితరులు

తిరుమలాయపాలెం: లయన్స్ క్లబ్ ఆఫ్ ఖమ్మం గ్రేట్ ఆధ్వర్యాన బుధవారం మండలంలోని ఎదుళ్ల చెరువులో వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు. ప్రాథమిక పాఠశాల ఆవరణలో జరిగిన కార్యక్రమంలో ఆ సంస్థ అధ్యక్షుడు పెసర ప్రభాకర్‌రెడ్డి మాట్లాడగా.. కార్యక్రమంలో హెచ్‌ఎంలు విజయకుమారి, రవి, ఉపాధ్యాయులు ప్రతిభ, శోభన, కృష్ణకళ, గోపమ్మ, నాగమణి, గ్రామస్తులు కమతం రాము తదితరులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ సామర్థ్యం పెంపు

ఖమ్మంవ్యవసాయం: విద్యుత్ సమస్యలు తలెత్తకుండా నగరంలోని దానవాయిగూడెం 33/11 కేవీ సబ్ స్టేషన్‌లో ప్రస్తుతం 3 ఎంవీఏ(మెగా ఓల్ట్ యాంపియర్) ట్రాన్స్‌ఫార్మర్ స్థానంలో రూ. 80లక్షలతో కూడిన 5 ఎంవీఏ నూతన ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేశారు. ఈనేపథ్యాన బుధవారం ఈ ట్రాన్స్‌ఫార్మర్ నిర్వహణను విద్యుత్ అధికారులు పరిశీలించి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం డివిజన్ ఆపరేషన్స్ డీఈ నంబూరి రామారావు, ఎంఆర్‌టీ డీఈ భద్రూపవార్, టౌన్–1 ఏడీఈ నాగార్జున, ఏడీఈ రాందాస్‌నాయక్, ఏఈలు క్రాంతి సింహ, బోజ్యానాయక్, ఉద్యోగులు, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

ఖమ్మంక్రైం: 1989 బ్యాచ్‌కు చెందిన హెడ్ కానిస్టేబుల్ మహ్మద్‌రహీమ్ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందగా.. ఉమ్మడి ఖమ్మం జిల్లాకు చెందిన తోటి బ్యాచ్ పోలీస్ సిబ్బంది తమవంతు సాయంగా బుధవారం రూ.50వేల ఆర్థిక సాయాన్ని సీపీఆర్‌బీ సీఐ స్వామి చేతుల మీదుగా కుటుంబసభ్యులకు అందించారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ సీఐ శివసాంబిరెడ్డి, ఎస్సైలు సుబ్బారావు, స్టాఫ్ రాంరెడ్డి, దానియేలు, శ్రీనివాసరాజు, గాంధీ, నాగేశ్వరరావు, శ్రీనివాస్‌రావు, హరినారాయణ పాల్గొన్నారు.

అప్పలనరసింహాపురం గ్రామస్తుల ఔదార్యం


నగదు అందిస్తున్న గ్రామ పెద్దలు

నేలకొండపల్లి: మండలంలోని అప్పలనరసింహాపురం గ్రామానికి చెందిన అచ్చయ్య (36) అనే పంచాయతీ వర్కర్ అనారోగ్యంతో బాధపడుతూ గత డిసెంబర్ 4న మృతి చెందాడు. మృతి వార్త మరవకముందే మూడు రోజులకే ఆయన తల్లి చిన్నక్క(63) మృతి చెందింది. నిరుపేద కుటుంబం కావడంతో అంత్యక్రియలు, కర్మకండ తదితర కార్యక్రమాలు నిర్వహించేందుకు గ్రామస్తులంతా ఒక్కటే ఎవరికి తోచిన సాయం వారు అందించారు. అన్ని కార్యక్రమాలు అయ్యాక మిగిలిన రూ.38వేలను మృతుడి కుమార్తె చదువు నిమిత్తం బుధవారం అందించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటి మాజీ చైర్మన్ వెనికె జానకిరామయ్య, మాజీ సర్పంచ్ మన్నె నగేష్, లిప్ప చైర్మన్ భూషయ్య, బందెల ప్రసాద్, పందుల వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

సంక్రాంతికి ముగ్గుల పోటీలు

కూసుమంచి/నేలకొండపల్లి: పాలేరు నియోజకవర్గంలోని మహిళలకు సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని ఈనెల 10న మండల కేంద్రాల్లో మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించనున్నట్లు మంత్రి క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జ్ తుంబూరు దయాకర్‌రెడ్డి తెలిపారు. మధ్యాహ్నం 12 గంటల నుంచి ఈ పోటీలు ప్రారంభమవుతాయని, ఆసక్తి గల మహిళలు తమ పేర్లను గురువారం సాయంత్రంలోగా కూసుమంచిలోని క్యాంపు కార్యాలయంలో అందించాలని కోరారు. అలాగే నేలకొండపల్లిలోని డిగ్రీ కాలేజీ దగ్గర ఏర్పాటు చేసిన పోటీల్లో పాల్గొనదలచిన వారు స్థానిక కాంగ్రెస్ కార్యాలయంలో తమ పేర్లు నమోదు చేసుకోవాలని మార్కెట్ కమిటీ చైర్మన్ వెన్నపూసల సీతారాములు కోరారు.

'హార్వెస్ట్'లో సంక్రాంతి వేడుకలు

ఖమ్మంసహకారనగర్: నగరంలోని హార్వెస్ట్ పాఠశాలలో బుధవారం ఉత్సాహంగా ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు, విద్యార్థినీ విద్యార్థులు వారి తల్లిదండ్రులతో సంక్రాంతి సంబరాలను నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో బోగి మంటలు వేసి గాలిపటాలను ఎగురవేశారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ రవిమారుత్ మాట్లాడగా.. ప్రిన్సిపాల్ పార్వతీరెడ్డి, హెచ్‌ఎం మానస, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అప్రమత్తత అవసరం

ఖమ్మంరూరల్: డిజిటల్ మోసాలపై అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందని సైబర్ క్రైం ఏసీపీ ఫణీందర్ అన్నారు. మండలంలోని కొత్తూరులో గల కస్తూర్బాగాంధీ విద్యాలయంలో సైబర్ నేరాలపై విద్యార్థినులకు అవగాహన కల్పించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. చట్ట ప్రకారం ఫోన్ కాల్స్, వాట్సాప్‌లలో అరెస్ట్ వారెంట్‌లను జారీ చేయరని, వ్యక్తిగత లేదా ఆర్థిక సమాచారం ఎవరితోనూ షేర్ చేయొద్దన్నారు. ఏదైనా ఎమర్జెన్సీ కోసం సైబర్ క్రైం పోర్టల్ లేదా డయల్ 1930కు ఫిర్యాదు చేయాలని సూచించారు.

● ఇలా మొరాయిస్తే ఎలా?

అగ్నిప్రమాదాలు, విపత్తులు సంభవించిన అత్యవసర సమయాల్లో ఆదుకోవాల్సిన వాహనానికి సుస్తీ చేసింది. బుధవారం ఫైరింజన్ నగరంలోని బస్టాండ్ సమీపంలో మొరాయించడంతో ఆ వాహనాన్ని స్టార్ట్ చేసేందుకు నానా ఇబ్బందులు పడ్డారు. అత్యవసర సమయాల్లో ఇలా మొరాయిస్తే ఎలా అంటూ స్థానికులు చర్చించుకున్నారు.

– స్టాఫ్ ఫొటోగ్రాఫర్


ఫైరింజన్‌ను నెడుతున్న సిబ్బంది